క్లుప్తంగా

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో కామేపల్లి పోలేరమ్మతల్లి

కామేపల్లి(కొండపి): జరుగుమల్లి మండలం కామేపల్లి పోలేరమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక తిరునాళ్లలో భాగంగా మంగళవారం అమ్మవారిని భక్తుల సందర్శనార్థం ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. వార్షిక తిరునాళ్ల సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై పూజలు చేశారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రతాపురెడ్డి

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మూరక ప్రతాపరెడ్డి అన్నారు. ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 65 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 104 వాహన సిబ్బంది మస్తాన్, విడ్ తదితరులున్నారు.

9 నుంచి నెల్లూరమ్మ తల్లి వార్షికోత్సవాలు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండల పరిధిలోని కృష్ణంనాయునిపల్లిలో వెలసిన నెల్లూరమ్మ దేవస్థానం సీతారామచంద్రస్వామి వార్షికోత్సవాలు ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12న ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ. 60116, ద్వితీయ బహుమతి రూ.40116, తృతీయ బహుమతి రూ. 30116 అందజేస్తామన్నారు.

ఆర్వో ప్లాంట్‌కు స్థల పరిశీలన

పామూరు: మండలంలోని అయ్యన్నకోటలో ఏర్పాటు చేయనున్న ఆర్వోప్లాంటుకు మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ తుమ్మా వరమ్మ, ఎంపీటీసీ సవరం రత్తమ్మ, అధికారులు స్థల పరిశీలన చేశారు. తుమ్మా పిచ్చిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరెడ్డి, ఎస్టీకాలనీవాసులు పాల్గొన్నారు.

వాహనాలకు జరిమానా



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

కందుకూరు: కందుకూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కే ఎండీ రఫీ మంగళవారం పట్టణంలోని వాహనాలు విస్తృతంగా తనిఖీ చేపట్టారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను సీజ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్, ట్యాక్స్ కట్టని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటికి దాదాపు రూ.44640

రిసార్ట్స్ స్థల పరిశీలన



రిసార్ట్స్ భూమిని పరిశీలిస్తున్న జేసీ

ఉలవపాడు: మండల పరిధిలోని రామాయపట్నం గ్రామతీరంలోని రిసార్ట్స్ స్థలానికి జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ మంగళవారం పరిశీలించారు. గతంలో రిసార్ట్స్ స్థలం బంగాళా పోరంబోకు భూమిగా ఉంది. దీనినిఏపీ టూరిజం బోర్డుకు బదిలీ చేయడానికి ఫైలు పెట్టడంతో దానిని పరిశీలించడానికి వచ్చారు. భూమి వివరాలు, రికార్డులు పరిశీలించారు. నివేదిక తయారు చేసి అందచేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ బ్రహ్మయ్య, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పరకొండపాడు గ్రామం వద్ద ఉన్న మన్నేరు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం తెలియడంతో ఎస్సై ప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు పోలీసులు మన్నేరు వద్దకు చేరుకొని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పేదల ఇళ్లు వేగంగా పూర్తి చేయాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పురోగతి సాధించాలి
- పనులు ప్రారంభించని లే అవుట్లలో వెంటనే పనులు చేపట్టేలా చర్యలు
- గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మానుగుంట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న పేదల ఇళ్లను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల హౌసింగ్‌శాఖ అధికారులు, ఎంపీడీఓలు, మెప్మా, ఏపీఎంలు, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లేఅవుట్ల వారీగా ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు, ఎన్ని ప్రారంభించారని, ఏ దశలో ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించి వాటికి పరిష్కార మార్గాలను సూచించారు. ఇళ్ల నిర్మాణంతో సంబంధం ఉన్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే త్వరితగతిన నిర్మాణాలు పూర్తి అవుతాయని చెప్పారు. పేదలకు అవగాహన కల్పించడంతో పాటు, మెటీరియల్‌ను సకాలంలో అందించాలని, అలాగే బిల్లులను వెంటనే చెల్లించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావడంతో పాటు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్ల నిర్మాణంలో కచ్చితంగా పురోగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. హౌసింగ్‌శాఖ పీడీ నర్సింహులు, పబ్లిక్ హెల్త్ ఈఈ ఆలీ, డీఎల్‌డీఏ పద్మజ, మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏఈలు, ఏఎంపీఎం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మన్నెం చిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

పొన్నలూరు(జరుగుమల్లి): పోలేరమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా జరుగుమల్లి మండలం కామేపల్లిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పొన్నలూరు మండలం ఉప్పలదిన్నె గ్రామానికి చెందిన సర్పంచ్ మన్నెం పద్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు మన్నెం చిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యుత్‌ప్రభ ఏర్పాటు చేయగా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విద్యుత్ ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ విద్యుత్ ప్రభపై ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైస్ సర్పంచ్ కట్టా కరుణాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెం రవణయ్య, మన్నెం పెద వెంకటేశ్వర్లు, కొలు వాసు, మన్నెం మహేష్, మన్నెం ప్రసాద్, మన్నెం రాజా, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మహా రుద్రపీఠ ప్రతిష్ట మహోత్సవాలు

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడులో వెలసిన మహారుద్రపీఠం ప్రతిష్ట మహోత్సవం ఈ నెల 8 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు పలుకూరి సుబ్బారావు తెలిపారు. 8న గురువారం గణపతి పూజ, పుణ్యావచనం, కంకణ ధారణ, అంకురారోపణ, 9న శుక్రవారం 108 ప్రథమ అష్టోత్తర శివలింగాల ప్రతిష్ట, 10న శనివారం ద్వితీయ అష్టోత్తర శివలింగాల ప్రతిష్ట, 11వ తేదీ ఆదివారం, తృతీయ అష్టోత్తర శివలింగాల ప్రతిష్ట, నవనాగుల ప్రతిష్ట, 12న సోమవారం ప్రధాన సహస్రనామ శివలింగ ప్రతిష్ట, గణపతి, సుబ్రహ్మణ్యం, ఆదిశంకరుల, నక్షత్ర శివలింగాలు, విగ్రహ ప్రతిష్టలు, శిఖర బింబ ప్రతిష్టలు, పూర్ణాహుతి, కుంభాబిషేకం, శాంతి కళ్యాణం, విశేష గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా

- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



వ్యాపారులతో మాట్లాడుతున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే తప్పక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని కందుకూరు రోడ్డు, ఆర్టీసీ డిపో తదితర ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి అన్ని రకాల వ్యాపారులు, దుకాణదారులు సహకరించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానా విధించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కౌన్సిలర్లు దేవరాజ్, శ్రీ రాం సతీష్, మండల విద్యాశాఖ అధికారి జె. ప్రసాద్‌రావు, దాసుప్రసాద్, శానటరీ కార్యదర్శి స్రవంతి, వైఎస్సార్ సీపీ నాయకులు బొట్టు శ్రీను, మన్సూర్ పాల్గొన్నారు.

దొంగలొస్తున్నారు.. అప్రమత్తంగా ఉండండి



కొండారెడ్డిపల్లిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

హనుమంతునిపాడు: గ్రామాల్లో రాత్రిళ్లు మహిళలు, పురుషులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై క్రిష్ణ పావని సూచించారు. మండలంలోని కొండారెడ్డిపల్లి, రశీదుపురం, కోటతిప్పల తదితర గ్రామాల్లో ఆమె పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల మండలంలో మహిళల మెడలో గొలుసుల చోరీ, వేములపాడు ప్రాంతంలో పశువులు చోరీకి గురయ్యాయని, నిందితులను పట్టుకొని జైలుకు కూడా పంపించామన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: ఆరోగ్య సబ్ సెంటర్ల పరిధిలో సీజనల్ వ్యాధులు సోకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సందీప్ అన్నారు. స్థానిక ఆస్పత్రిలో ఆశావర్కర్ల, ఏఎన్ఎంలకు, ఎంఎల్‌పీహెచ్‌లకు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వాంతులు, వీరేచనాలు అవుతున్నట్లు గుర్తించిన వెంటనే ప్రథమ చికిత్స చేసి వెంటనే పీహెచ్‌లకు తీసుకురావాలన్నారు. ప్రాణాంతక వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డెంగీ వ్యాధులు సోకుండా ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలు చేయించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు నిర్మాలాజ్యోతి, పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పామూరు: విద్యుదాఘాతంతో మండలంలోని ఇనిమెర్లలో రూ..50 వేల విలువైన గేదె మృతి చెందింది. వివరాలు... ఇనిమెర్ల గ్రామం గోదా మాలకొండారెడ్డికి చెందిన గేదె మేత కోసం మంగళవారం మధ్యాహ్నం పొలం వైపునకు వెళ్లింది. బలమైన గాలులకు పొలంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లను గేదె తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

వైఎస్సార్ బీమా నమోదు వేగవంతం చేయాలి

వెలిగండ్ల: వైఎస్సార్ బీమా నగదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ సుకుమార్ మాట్లాడుతూ బయోమెట్రిక్‌ను తప్పనిసరిగా వేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు.

అక్రమ మస్టర్లు వేస్తే చర్యలు



నేకూనాంపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ

వలేటివారిపాలెం: ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఏపీడీ సంజీవ్‌రావు హెచ్చరించారు. మండలంలోని నేకునాపురంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఆకస్మాత్తుగా తనిఖీ చేసి పరిశీలించారు. ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో తెల్లవారుజామునే పనులకు వచ్చి ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తామన్నారు. జాబ్‌కార్డు లేని వారు కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకొని జాబ్‌కార్డు పొందాలని సూచించారు. కాకుటూరులో ఏపీఓ షమీర్‌బాషా ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

- ఉక్కిరిబిక్కిరైన ప్రజానీకం



విద్యుత్ లైను మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

వెలిగండ్ల: విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిన కారణంగా ప్రజానీకం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, ప్రైవేట్ సంస్థల్లో రోజువారీ సేవలకు అంతరాయం ఏర్పడింది. భానుడు తీవ్ర రూపం దాల్చిన దృష్ట్యా ఎండ వేడికి తట్టుకోలేక ఇళ్లలో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు.

పాలిమర్ ఇన్సులేటర్లను ఏర్పాటు చేసేందుకే విద్యుత్ నిలిపివేత

విద్యుత్‌కు అంతరాయం ఎందుకు ఏర్పడిందంటే.....గతంలో విద్యుత్ స్తంభాలకు పింగాణీ ఇన్సులేటర్లు ఉండేవి. పింగాణీ ఇన్సులేటర్లు ఉరుములు, మెరుపులకు మరమ్మతులకు గురయ్యేవి. మెరుగైన విద్యుత్‌కు సరఫరా చేసేందుకు పింగాణి ఇన్సులేటర్ల స్థానంలో కొత్త పాలిమర్ ఇన్సులేటర్లను ఏర్పాటు చేశారు. కనిగిరి నుంచి మొగళ్లూరు వరకు ఉన్నటువంటి 33 కేవీ/ 11కేవీ మెయిన్‌లైన్‌లో మొత్తం 100 పాలిమర్ ఇన్సులేటర్లను ఏర్పాటు చేశారు. పాలిమర్ ఇన్సులేటర్లు ఉరుముల, మెరుపులకు తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయని, పాలిమర్ ఇన్సులేటర్లను ఏర్పాటు చేసేందుకు మంగళవారం విద్యుత్ నిలివేశామని ఏఈ రసూల్ తెలిపారు.

ఉపాధి పనులకు వెళ్లి కూలీ మృతి

కొండపి: మండలంలోని అనకర్లపూడిలో నెన్నూపాడు గ్రామం వెళ్లే దారిలోని చెరువులో మంగళవారం ఉపాధి పనులు చేస్తున్న పెద్దినేని వెంకటేశ్వర్లు(74) పని ప్రదేశంలో కుప్పకూలిపోయాడు. ఏపీఓ మహలక్ష్మి తెలిపిన వివరాల మేరకు అనకర్లపూడి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లగా..పడిపోవడంతో వడదెబ్బ అని భావించి తోటి కూలీలు ఇంటికి చేర్చారు. ఇంటికి చేర్చిన కొద్దిసేపటికి వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పులిరమేష్

గుడ్లూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ పులి రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ శాఖల వివరాలను చదివి వినిపించారు. పశువులకు బీమా చేసినా ఇంత వరకు బీమా నగదు అందలేదని జెడ్పీటీసీ కోర్సిపాటి బాపిరెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పలు గ్రామాలలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, లో ఓల్టేజీతో మంచినీటి పథకాలు సక్రమంగా పనిచేయడం లేదని విద్యుత్ సరఫరాలో కూడా తరుచూ అంతరాయాలు ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాల సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకురాగా..సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

వ్యవసాయాధికారి రవికుమార్, పశు సంవర్ధక శాఖ డి.గోవర్ధన్, ఎంఈఓ ప్రసాదరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజశేఖర్, డీఎల్‌పీఓ కృష్ణమోహన్, ఎంపీడీఓ చంద్రసేన్, డీటీ రమేష్, మండల కో ఆప్షన్ సభ్యుడు రషీద్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దాతల సహకారంతో వైద్యశాల అభివృద్ధి

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

ఉలవపాడు: దాతల సహకారంతో వైద్యశాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అన్నారు. స్థానిక సీహెచ్‌సీ వైద్యశాలలో మంగళవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో మానవత్వం ఉందని, దాన్ని ఉపయోగించుకోవడంలో నాయకులు, ఉద్యోగులు విఫలమయ్యారని తెలిపారు. వైద్యశాలలో రోగుల సంఖ్య పెంచాలని తెలిపారు. దాతలు పలు పరికరాలు వైద్యశాలకు అందించారని, వాటి వల్ల రోగుల సంఖ్య పెరిగిందా, ప్రజలకు ఉపయోగం జరిగిందా అని అడిగి తెలుసుకున్నారు. తీర్మానం చేసిన తరువాత దోబీకి బిల్లులు పెండింగ్ ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. వైద్యశాల అభివృద్ధికి మంచి కార్యక్రమాలు చేయాలని సూచించారు. పుట్టిన పిల్లలకు ధృవీకరణ సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని తెలిపారు. విద్యుత్‌ను అవసరమైనంత వరకు వాడాలని తెలిపారు. వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీఓ చెంచమ్మ, సర్పంచ్ నాగలక్ష్మి, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



భూమిపూజ చేస్తున్న హుసేన్‌రెడ్డి, నేతలు

పామూరు: నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మార్కొండాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం దేవిరెడ్డి రామిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు రూ.48 లక్షల నిధులతో మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. నాడు నేడుతో కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. పాఠశాల భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పార్టీ బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, అంకిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రయోజనాలు సద్వినియోగం చేసుకోండి

- పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి



విత్తనాలు పంపిణి చేస్తున్న జేడీ డాక్టర్ బేబీరాణి

టంగుటూరు: ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి అన్నారు. మండలంలోని వల్లూరు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన పశు విజ్ఞానబడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడి రైతులకు వైఎస్సార్ పశు బీమా పథకం గురించి వివరించారు. వేసవిలో పశువుల యాయమాన్య పద్ధతుల గురించి, పశువులు తెరగ కట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే జగనన్న పాల వెల్లువ వల్ల రైతులకు కలిగే లాభాలు, ప్రయోజనాలు, పెరిగిన పాల ధరల గురించి తెలియజేశారు. పాడి రైతులకు సబ్సిడీపై గేదెలు, గడ్డి, విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ జి. విజయమాధవి, సిబ్బంది నరేంద్ర లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమకారుడు పాలస్



పాలస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: ప్రజా ఉద్యమకారుడు సదర్శి పాలస్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మాలకొండయ్య అన్నారు. మంగళవారం పాలస్ 7వ వర్ధంతి సభ సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలం పునికిపుచ్చుకుని తన జీవితం యావత్తు ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన ఉద్యమకారుడు అని కొనియాడారు. అనేక పోరాటాలు నిర్వహించి ప్రజల పక్షాల నిలిచిన కమ్యూనిస్టు అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి ఎస్ రావమ్మ మాట్లాడుతూ ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ బాబు, సహాయ కార్యదర్శి పి. బాలకోటయ్య, ఏఐటీయూసీ కార్యదర్శి వై ఆనందమోహన్, సీపీఐ నాయకులు ఆదినారాయణ, ఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై దొంగల దోపిడీ

సింగరాయకొండ: జాతీయరహదారిపై దొంగలు హల్‌చల్ చేసి లారీ డ్రైవర్ వద్ద రూ.32 వేల నగదు లాక్కెళ్లారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో కనుమళ్ల జంక్షన్ వద్ద జరిగింది. జాతీయరహదారి సిబ్బంది కథనం ప్రకారం..చెన్నై నుంచి కాకినాడ వెళ్తున్న లారీ డ్రైవర్ సుమారు 2.30 గంటల సమయంలో కనుమళ్ల జంక్షన్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జాతీయరహదారి పక్కన లారీ ఆపి లారీ అద్దాలు వేసుకుని నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో ఐదుగురు కుర్రాళ్లు వచ్చి లారీ డ్రైవర్‌ను నిద్రలేపి తీవ్రంగా గాయపరచటంతో పాటు బెదిరించి అతని వద్ద రూ.32 వేల లాక్కున్నారు. తీవ్రంగా గాయపరచిన లారీ డ్రైవర్ వెంకటేశ్వర్లుకు హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రథమచికిత్స చేశారు. అయితే ఈ సంఘటనకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు తెలిపారు.

ఆటో ప్రమాదంలో ఒకరు దుర్మరణం

కనిగిరి రూరల్: పట్టణ సమీపంలోని గార్లపేట రోడ్డులో మోడల్ స్కూల్ సమీపంలో ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని బొగ్గులగొంది కాలనీకి చెందిన సుబ్బరాయుడు(65) మరి కొందరు ఆటో ఎక్కి కనిగిరికి వస్తుండగా మార్గ మధ్యంలో మోడల్ స్కూల్ సమీపంలో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. మరి కొందరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలిస్తున్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

ఉలవపాడు: గ్రంథాలయాలకు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ కమిటీ సభ్యులు మహేష్‌బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి శిక్షణ విద్యార్థులకు ఉపయోగపడుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయిలో రాణించాలంటే గ్రంథాలయాలలో పుస్తకాలను చదవాలని అన్నారు.